# 1. తేనెల తేటల మాటలతో

పద్యభాగం

**నేపథ్యం:**

జతపరచండి.

| | |
|---|---|
| మహాత్మా గాంధీ | చాచాజీ |
| జవహర్‌లాల్ నెహ్రూ | మన్నెం వీరుడు |
| అల్లూరి సీతారామరాజు | జాతిపిత |
| బాలగంగాధర్ తిలక్ | నేతాజీ |
| సుభాష్ చంద్రబోస్ | లోకమాన్య |



పల్లవి
తేనెల తేటల మాటలతో
మన దేశమాతనే కొలిచెదమా
భావం, భాష్యం చూసుకొని
సుఖజీవనయానం చేయుదమా || తేనెల || 1

చ||
సాగరమేఖల చుట్టుకొని
సురగంగ చీరగా మలచుకొని
స్వేచ్ఛాగానం పాడుకొని
మన దేవికి ఇవ్వాలి హారతులు || తేనెల || 2

చ||
గంగజటాధర భావనలో
హిమశైల రూపమే నిలుపుకొని
గలగల పారే నదులన్ని
ఒక బృందగానమే చేస్తూ ఉంటే || తేనెల || 3

చ||
ఎందరో వీరుల త్యాగఫలం
మన నేటి స్వేచ్ఛకు మూలబలం
వారందరిని తలుచుకొని
మన మానసవీధిని నిలుపుకొని || తేనెల || 4

**I. వినండి–సంభాషించండి.**

1. మన దేశానికి భారతదేశం అనే పేరెలా వచ్చింది?
2. హిమాలయ పర్వతాలు భారతదేశమునకు ఏ దిశలో కలవు?
3. దేశానికి స్వాతంత్ర్యం తేవడానికి ప్రాణాలిచ్చిన కొందరి నాయకుల పేర్లు తెలపండి.

**II. చదవండి–ఆలోచించండి–రాయండి.**

**అ. పదజాలాన్ని పెంపొందించుకుందాం. భావాలు తెలుసుకుందాం.**

హిమశైలం = హిమాలయ పర్వతం; భావన = ఆలోచన, తలంపు; యానం = గమనం, వెళ్ళడం; బృందగానం = సామూహికంగా పాడడం.

**ఆ. భావాలు:**

1. తియ్య తియ్యని స్వచ్ఛమైన మాటలతో మన భారతమాతను కొలిచెదము. భావం, భాష్యం (వ్యాఖ్యానం) కూర్చుకుని, సుఖమైన ప్రయాణం చేయుదము.

2. సముద్రపు మొలనూలు చుట్టుకొని, సురగంగను చీరగా ధరించి, స్వేచ్ఛాగీతం పాడుకొని, మన భారతమాతకు హారతులు ఇవ్వాలి.

3. తన ఝటాజూటంలో గంగను బంధించిన శివుని భావనలో హిమాలయ పర్వతరూపాన్నే నిలుపుకొని, గలగలపారే నదులన్నీ సమూహంగా పాడుతుంటే.

4. ఈనాటి మన స్వేచ్ఛకు మూలబలం ఎందరో వీరుల త్యాగ ఫలితం. వారందరిని మనము తలచుకొంటూ, మన మనోవీధియందు వారిని నిలుపుకొనవలెను.

**III. కృత్యం:**

**పాఠ్యభాగంలోని కింది గేయ చరణాలను చదివి, సూచనానుసారం కృత్యాలు చేయండి.**

**అ. కింది అల్లికను పూరించండి.**

| | | |
|---|---|---|
| ________ | | ________ |
| | మన దేవికి హారతులు ఇవ్వవలసిన తీరు | |
| ________ | | ________ |

పుట సంఖ్య 1లోని 2, 3, 4 గేయాలు

**ఆ. కింది పదాలకు సమానార్థకములను రాయండి.**

1) మేఖల = ________ 2) హిమశైలం = ________




**ఇ. స్వీయస్పందన :**

మన స్వేచ్ఛకు మూలబలం అయిన వారిని ఏ విధంగా స్మరించుకొనవలెనో మీ సొంతమాటల్లో రాయండి.

**IV. వినండి–ఆలోచించండి/చర్చించండి–రాయండి.**

**అ. కింది ఖాళీలను తగిన పదాలతో పూరించండి.**

1. మన నేటి ____________కు మూలబలం.
2. ____________ జీవనయానం చేయుదమా.
3. ____________ రూపమే నిలుపుకొని.
4. మన దేవికి ఇవ్వాలి ____________

ఆ. **జవాబులు రాయండి.**

1. మన నేటి స్వేచ్ఛకు ఎవరు మూలబలం?
2. మనం హారతులు ఎవరికి ఇవ్వాలి?
3. బృందగానం ఎలా చేస్తున్నారు?

## V. స్వీయస్పందన

1. దేశమాతను ఎలా కొలువవలెనో మీ సొంతమాటల్లో రాయండి.
2. మన దేశ స్వాతంత్ర్యము కొరకు పోరాడిన నాయకులను గూర్చి మీ సొంతమాటల్లో రాయండి.

## VI. భాషావగాహన:

అ. **కింది వాక్యాలలో గుర్తింపబడిన ప్రత్యయాలు ఏ విభక్తులకు చెందినవో రాయండి.**

1. తేనెల తేటల మాటలతో ______
2. గంగ జతాధర భావనలో ______
3. మన మానస వీధిని నిలువుకొని ______

ఆ. **కింది పదాలను సొంతవాక్యాలలో ఉపయోగించండి.**

1. స్వేచ్ఛ
2. గలగల
3. త్యాగఫలం

ఇ. **కింది పదాలను విడదీసి రాయండి.**

1. వారందరిని = ______ + ______
2. నదులన్ని = ______ + ______

## VII. సృజనాత్మకత:

**గాంధీగారి ఉప్పు సత్యాగ్రహం గురించి అంతర్జాలంలో వెదకి రాయండి.**

**సంధి:**

స్వరము – అచ్చు

పూర్వస్వరము – మొదటి పదము చివరి అచ్చు

పరస్వరము – రెండవ పదములోని మొదటి అచ్చు

సూత్రము : పూర్వ పరస్వరంబులకు పరస్వరము ఏకాదేశమగుట సంధి అనబడు.

రాముడతడు = రాముడు + అతడు = పూర్వపదము అనగా మొదటి పదము (రాముడు) రెండవ పదాన్ని పరపదము అంటారు. 'అతడు' అన్నది పరపదము. దీనిలోని మొదటి అచ్చు 'అ' పూర్వపదములోని 'ఉ' అను స్వరమునకు పరపదములోని 'అ' అను స్వరమునకు సంధి జరుగును. అట్లు సంధి జరిగినపుడు పూర్వస్వరము తొలగిపోయి పరస్వరము మాత్రమే వచ్చుటను 'సంధి' అందురు.

రాముడు + అతడు – రాముడ్ + అతడు = రాముడతడు.

**నేనివి నేర్చుకున్నా:**

- భారతదేశ ఔన్నత్యం
- వీరుల త్యాగం

**ఉ.సూ:** స్వాతంత్ర్య సమరయోధుల జీవిత గాథలను విద్యార్థులకు తెలపండి.

**వి.సూ:** గొప్ప త్యాగవీరుల గాథలను ఉపాధ్యాయుల దగ్గరి నుండి తెలుసుకోవలెను.

I82H8U